క్లుప్తంగా

హిందీ భాషపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జి

పాకాల : విద్యార్థులు ద్వితీయ భాష హిందీపై పట్టు సాధించాలని ఎంఈఓ బాబ్జి తెలిపారు. సోమవారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు చెందిన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దేశంలో ఎక్కువగా మాట్లాడే భాషల్లో హిందీ మొదటి స్థానంలో ఉందన్నారు. మన రాష్ట్రంలో 10వ తరగతి వరకు ద్వితీయ భాషగా హిందీ ఉంటుందన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు పాఠం చెప్పేటప్పుడు విద్యార్థుల చేత హిందీ పదాలు పలికించాలని, బోర్డుపై హిందీ పదాలు రాయించి, వాడుక భాషలో హిందీలో మాట్లాడించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజ, రిసోర్స్ పర్సన్ గిరిబాబు, మల్లీశ్వరి, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాట్య గణపతి విగ్రహ ఏర్పాటుకు వినతి



జేఈఓ వీరబ్రహ్మంకు వినతిపత్రం అందిస్తున్న తిరుపతి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు

తిరుపతి(అలిపిరి): వినాయక సాగర్‌లో 60 అడుగుల నాట్య గణపతి విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మంకు తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. సోమవారం టీటీడీ పరిపాలన భవనంలో వారు జేఈఓను కలిశారు. వచ్చే వినాయక చవితికి వినాయకసాగర్ వద్ద ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. ఏటా టీటీడీ నుంచి అందిస్తున్న తెప్పలు, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, పుస్తక ప్రసాద వితరణ, అన్నమాచార్య కచేరి, కోలాట భజన బృందం, నగరంలో అలంకరణలు, కంకణాలు, వ్రతకల్ప పుస్తకాలు, వేంకటేశ్వరస్వామి పుస్తక ప్రసాదం, మనగుడి ప్రసాదాలు, ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయడానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో సామంచి శ్రీనివాసులు, భానుప్రకాష్‌రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, నవీన్, శేఖర్ పాల్గొన్నారు.

వెండి శఠారి బహూకరణ



వెండి శఠారిని అందజేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్: కపిలతీర్థం(ఆళ్వార్ తీర్థం)లో వేంచేసిన నమ్మాళ్వార్‌లకు తిరుపతికి చెందిన సతీష్, జయలక్ష్మి దంపతులు సుమారు రూ.90 వేలు విలువ చేసే వెండి శఠారిని విరాళంగా అందజేశారు. సోమవారం దాతలు శఠారిని టీటీడీ పెద్దజీయర్‌స్వామి సమక్షంలో అందించారు. అనంతరం అక్కడి నుంచి ప్రముఖ సంస్కృత పండితుడు, జాతీయ సంస్కృత వర్సిటీ సాహిత్య విభాగం పూర్వ అధ్యక్షుడు ఆచార్య చక్రవర్తి రంగనాథన్, సతీష్ నమ్మాళ్వార్ ఆలయ అర్చకులు భాష్యం వారికి శఠారిని నమ్మాళ్వార్ స్వామి వారి నిత్య కైంకర్యాలకు అందజేశారు.

ఘనంగా రక్షాబంధన్



విశ్రాంత జవాన్‌కు రాఖీ కట్టి సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

తిరుపతి కల్చరల్: రాఖీ పౌర్ణమిని జైజవాన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌జీఓఎస్ కాలనీ పార్క్‌లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకురాలు శాంతారెడ్డి అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ వీజీఓ నందకిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతారెడ్డి మాట్లాడుతూ క్రమం తప్పకుండా తొమ్మిదేళ్లుగా రాఖీ పౌర్ణమిని విశ్రాంత ఆర్మీ జవాన్లతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వీజీఓ నందకిషోర్ మాట్లాడుతూ నేడు చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ చూపకపోవడంతో వారు చెడు మార్గాన్ని అనుసరిస్తూ దేశ విద్రోహ శక్తులుగా తయారవుతున్నారని తెలిపారు. అనంతరం మాజీ సైనికులకు రాఖీ కట్టి ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జనార్దన్‌రెడ్డి, డాక్టర్ శ్రీహరిరావు, బీజేపీ నేత విశ్వనాథ్, రాష్ట్రీయ సేవిక సమితి నాయకురాలు సుధామయి, గుండాల నాయక్, విశ్రాంత జవాన్లు మోహన్ రెడ్డి, బాలాజీ, కెప్టెన్ గోపాల్, ఆనంద్‌రెడ్డి, కేశవ రెడ్డితో పాటు అధిక సంఖ్యలో సైనికుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు మోక్షం ఎప్పుడో ?

విశ్వతమాల గ్రామం వద్ద గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన పక్కా ఇళ్లు







కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ముందుకు సాగిన ఇళ్ల నిర్మాణాలు

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఊరు తిరుపతి జిల్లా పరిధిలో ఉండే విశ్వతమాల గ్రామం. గత ప్రభుత్వం తిరుపతి–రేణిగుంట–చంద్రగిరి వాసులకు పేదలకు ఉచితంగా ఇంటి పట్టాతో పాటు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఒకటి కాదు 100 కాదు వేలాదిమంది పేదలకు ఉచిత నివాసం కల్పించడమే ధ్యేయంగా గత ప్రభుత్వం పని చేసింది. వాటిల్లో దాదాపు 70 శాతం ఇళ్లు పూర్తి కాగా, మరి కొన్ని 90 శాతం పూర్తి కావొచ్చాయి. ఆ దశలో ఎన్నికలు రావడం, తరువాత పూర్తయి నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటుతోంది. కానీ ఇళ్ల నిర్మాణంలో ఇంతవరకు పురోగతి లేదు. అలివికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలకు ఎంతమేర మంచి చేస్తుందో వేచి చూడాలి ?

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పున్నమి వెన్నెల్లో కల్యాణ వెంకన్న



చంద్రగిరి: పున్నమి వెన్నల్లో శ్రీకల్యాణ వేంకటేశ్వరుడు భక్తులను కటాక్షించాడు. శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యకైంకర్యాల అనంతరం అభిషేక సేవ చేపట్టారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌ను వజ్రాభరణాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడుడిపై అధిష్టించి నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి కల్పనకే సర్వే



సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవనోపాధుల సర్వేను కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. సోమవారం నగరంలోని దాసరిమఠంలో చేపట్టిన సర్వేను పరిశీలించి మెప్మా అధికారుల వద్ద వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘంలో ఉన్న ప్రతి మహిళ కుటుంబ వివరాలను నమోదు చేయాలన్నారు. వారి ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని జీవనోపాధి కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ఈ సర్వే ఉద్దేశమని తెలిపారు. అంతకముందు రామాపురం వద్ద గల బయోమైనింగ్ ప్లాంట్‌ను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. బైరాగిపట్టెడలో జరుగుతున్న డ్రింకింగ్ వాటర్‌ఫ్రమ్ ట్యాప్ సర్వేను రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. అమెనిటీ, అడ్మిన్ సెక్రటరీలు కలసి ఈ సర్వేను పక్కగా నిర్వహించాలన్నారు. ఇందులో ఎటువంటి పొరబాట్లకు తావులేకుండా సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మెప్మా పీడీ రాధమ్మ, డీఈలు విజయకుమార్ రెడ్డి, మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ఆర్‌ఓ సేతుమాధవ్, సీఎంఎం కృష్ణవేణి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

ఫొటోభవనం ప్రారంభం



ఐక్యత చాటుతున్న అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతి–తిరుమల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపాళెం లేఅవుట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫొటో భవనాన్ని ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు చేసి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజ్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు అనుబంధ వృత్తుల వారికి ఫొటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్ బలోపేతంతో పాటు సభ్యుల సంక్షేమానికి అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. 1992లో ఏర్పాటైన అసోసియేషన్ ప్రస్తుతం 560 మంది సభ్యులతో కొనసాగడంతో పాటు ఫొటోగ్రఫీపై పలు వర్క్‌షాపులు నిర్వహిస్తూ తద్వారా నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతోందన్నారు. వృత్తిపరమైన కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలతో సమాజహితం కోసం తోడ్పాటు అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రఘురాం, శివశంకర్, కన్నన్, నటశేఖర్, నాని, అమరనాథ్, సురేష్, సతీష్, హేమంత్, సభ్యులు పాల్గొన్నారు.

వర్సిటీ అధికారులపై సీఎంకు ఫిర్యాదు

తిరుపతి సిటీ: ఎస్వీయూనివర్సిటీలో గత రెండు నెలలుగా జరుగుతున్న పరిణామాలపై సీఎం చంద్రబాబు నాయుడుకు వర్సిటీలోని కొందరు ప్రొఫెసర్లు, ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. సోమవారం శ్రీసిటీ పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన సీఎం చంద్రబాబుతో పలువురు ఉద్యోగులు రెండు బృందాలుగా ఏర్పడి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఓ అధికారి ఏకపక్షంగా, నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటూ టీడీపీ, జనసేన పార్టీలకు అనుచరులుగా ఉన్న ఉద్యోగులపై వివక్ష చూపుతున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 128 మందిని ఏకకాలంలో బదిలీ చేశారని విన్నవించారు. బదిలీలలో ఆ అధికారి తన అనుచర వర్గానికి ప్రాధాన్యత కల్పించారని వాపోయారు. అన్ని విషయాలను సావధానంగా విన్న సీఎం స్థానిక కూటమి నాయకులతో చర్చించినట్లు సమాచారం. అన్ని విషయాలను పరిశీలిస్తానని వారికి సీఎం హామీ ఇచ్చినట్లు సమాచారం.

వెంకటేష్‌రెడ్డికి డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ పరిశోధక విద్యార్థి బి.వెంకటేష్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ చెంగయ్య పర్యవేక్షణలో డిజైన్ అండ్ ఆప్టిమైజేషన్ ఆఫ్ రెన్యూవబుల్ ఎనర్జీ బేస్డ్ ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.



అమాత్య.. దయ చూపరా..

'నా వార్డులో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. పరిష్కరించాలని చాలాసార్లు విన్నవించా. పట్టించుకోలేదు.. కనీసం ఇప్పుడైనా స్పందించి పరిష్కరించండి అమాత్య' అని డిమాండ్ చేస్తూ నగరంలోని 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి కోరుతున్నాడు. సోమవారం ఆయన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నేలపై కూర్చుని తన వార్డులో సమస్యలు పరిష్కరించాలని ఇలా నిరసన తెలిపాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నాన్నకు బాసటగా..



పున్నామ నరకం నుంచి కాపాడేవాడే కొడుకు అంటారు.. అది నిజమనిపించే దృశ్యం స్విమ్స్ ఆస్పత్రిలో సోమవారం సాక్షి కెమెరాకు చిక్కింది. కదిరి నుంచి చికిత్స నిమిత్తం సుబయ్య సిమ్స్‌కు వచ్చాడు. అయితే అతను వీల్‌చైర్‌లో వార్డుకు వెళ్లాల్సి ఉండగా, ఇబ్బంది పడుతున్నాడు. అది గమనించిన సుబ్బయ్య కొడుకులు వీల్‌చైర్‌ను ఒక్కపెట్టున తలా చేయి వేసి తోసుకెళ్లారు. ఓపీ దగ్గర నుంచి వార్డుకు షిఫ్ట్ అయ్యేటప్పుడు రోడ్డు ఎత్తుగా ఉండడంతో రోగులు వీల్‌చైర్‌లో వెళ్లేటప్పుడు ఇబ్బంది పడుతుంటారు. ఆ ఇద్దరు చిన్నారులు తండ్రిని వీల్‌చైర్ ద్వారా తీసుకెళ్లే దృశ్యాలను సాక్షి కెమెరా బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ప్రజా సమస్యలను పరిష్కరించండి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

తిరుపతి తుడా: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అందరూ దృష్టి సారించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించగా 42 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 మంది సమస్యలపై వినతులు అందజేశారని తెలిపారు. ప్రధానంగా శెట్టిపల్లిలో రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య, నగరంలో పలుచోట్ల రోడ్ల పక్కన ఉన్న చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించాలని కోరారు. అలాగే గృహ నిర్మాణ సమస్యలు, భూగర్భ డ్రైనేజీ సమస్యలు, గొల్లవానిగుంటలో సర్వే పనులు చేయించాలని ప్రజలు కోరారని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, సెక్రటరీ రాధిక, కేఎల్ వర్మ, డీసీపీ శ్రీనివాస రెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, రాజు, శ్రావణి, ఆర్‌ఓలు సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో ప్రణాళిక కీలకం



మాట్లాడుతున్న జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ పరిశీలకులు ప్రసాద్

తిరుపతి రూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ఆర్థిక ప్రణాళికలే కీలకమని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ పరిశీలకులు ప్రసాద్ తెలిపారు. తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, వీధి లైట్లు, విద్యుత్ బిల్లుల నిర్వహణపై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. తిరుపతి రూరల్ ఎంపీడీఓ రమేష్‌బాబు పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైన అన్ని అంశాలపై సమగ్ర అంచనాల తర్వాతే ఆర్థిక ప్రణాళికను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు రూపొందించాలన్నారు. పారిశుద్ధ్యం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం పలు అంశాలపై చంద్రగిరి, పాకాల ఈఓపీఆర్డీలు శశిరేఖ, మాలతి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, కార్యక్రమ సమన్వయకర్త, రూరల్ ఈవోపీఆర్డీ గిరిధర్‌రెడ్డి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

భావాలకు ప్రతిరూపం 'ఫొటో'



ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు



నవజీవన్ ఆశ్రమంలో సంబరాలు చేసుకుంటున్న ఫొటోగ్రాఫర్లు

- ఫొటో ఎగ్జిబిషన్ ప్రదర్శనలో వక్తలు ఉద్ఘాటన

తిరుపతి కల్చరల్: చెదరని తీపి జ్ఞాపకం ఫొటో అని, అలాంటి వృత్తిలో నిరంతరం శ్రమిస్తున్న ఫొటోగ్రాఫర్లు మరింత నైపుణ్యతను పెంచుకుని ఛాయా చిత్ర వృత్తికి మంచి పేరు తేవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జిల్లా ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటో ఎగ్జిబిషన్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ డాక్టర్ శిరీష, ప్రముఖ వ్యాపారవేత్త డాలర్ దివాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు ఉమామహేశ్వరరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ హాజరై ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ముందుగా ఫొటోగ్రఫీ సృష్టికర్తల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఫొటోలు తీయడానికి, ఆ ఫొటో సారాంశాన్ని భాషా ప్రపంచానికి తెలపడానికి ఎంతో ప్రయాసలతో కూడిన శ్రమ ఉండేదన్నారు. నేడు కెమెరాలు రూపాంతరం చెంది మంచి ఉపయుక్తాలతో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అనేక పదాల భావాలను ఫొటోలు చెబుతాయని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఫొటోగ్రఫీలో వచ్చిన మార్పులతో మరిన్ని మంచి జ్ఞాపకాలను చరిత్రకు అందించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు సీనియర్ ఫొటోగ్రాఫర్లు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ డే

తిరుపతి కల్చరల్: తిరుపతి ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నవజీవన్ ఆశ్రమంలో అంధులు, వృద్ధులు, దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్.ఆదిశేషయ్య, కోశాధికారి పురుషోత్తం, రాజు, ఉపాధ్యక్షులు గురుమూర్తి, ఏపీపీడబ్ల్యూజే అసోసియేషన్ సహాయ కార్యదర్శి ప్రవీన్‌కుమార్, సీనియర్ ఫొటోగ్రాఫర్స్ జేజే శంకర్, నాగేంద్రకుమార్, మధుసూధన్‌రెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

- కోల్‌కతా ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి
- వైద్యుల నిరసనకు న్యాయవాదులు, ప్రజాసంఘాల మద్దతు



సాయినగర్‌లో నిరసన ర్యాలీ చేస్తున్న సర్పంచ్ డీవీ రమణ, గ్రామస్తులు

చంద్రగిరి: కోల్‌కతాలో యువ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని విద్యాశాఖ అధికారులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి కొవ్వొత్తులతో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతున్న ప్రస్తుత కాలంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇటువంటి అఘాయిత్యాలు చేసిన వారికి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు భాస్కర్ బాబు, లలిత కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘీభావం

తిరుపతి లీగల్: కోలకతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ తిరుపతి రుయా ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు, డాక్టర్లకు తిరుపతి న్యాయవాదులు సోమవారం సంఘీభావం తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణ నుంచి రుయా వరకు న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు గోపీచంద్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృత్తి నిపుణులకు రక్షణగా చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్టిన్, మాజీ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నరహరి రెడ్డి, దినకర్, న్యాయవాదులు డాక్టర్ వెంకటేశ్వరరావు, ఇతర డాక్టర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కామాంధులను ఉరి తీయాలి

తిరుపతి రూరల్: మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి దారుణంగా చంపిన మానవ మృగాలను ఉరి తీయాలని సాయినగర్ సర్పంచ్ డీవీ రమణ డిమాండ్ చేశారు. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ సోమవారం సాయినగర్ పంచాయతీలో నిరసన ర్యాలీ చేశారు. మానవమృగాల దిష్టిబొమ్మలను తగలబెట్టారు. ప్లకార్డులు చేతపట్టుకుని నినదించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టండి

తిరుపతి కల్చరల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వ పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా, యూటీఎఫ్, డీవైఎఫ్, జన విజ్ఞాన వేదిక సంఘాల జిల్లా కార్యదర్శులు రవి, పి.సాయిలక్ష్మి, ముత్యాలరెడ్డి, జయచంద్ర, రెడ్డెప్ప డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం వారు వైద్యవిద్యార్థిని ఘటనను నిరసిస్తూ చెన్నారెడ్డి కాలనీ నుంచి మెడికల్ కళాశాల వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కోల్‌కతా ఘటనపై స్పందించి దుర్మార్గులను శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నేతలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



తిరుపతి: డాక్టర్లకు సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు



కొవ్వొత్తుల ర్యాలీలో ప్రజాసంఘాల నేతలు

ప్రభుత్వ భూముల రక్షణకు ప్రాధాన్యత



బాధ్యతలు స్వీకరించిన రామాంజనేయులు నాయక్

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో విలువైన ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రూరల్ మండల నూతన తహసీల్దార్ రామాంజనేయులు నాయక్ తెలిపారు. రూరల్ మండల తహసీల్దార్‌గా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం పరిపాలనాధికారిగా పనిచేస్తున్న ఆయన బదిలీపై రూరల్ తహసీల్దార్‌గా వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను రెండు రోజుల్లో క్లియర్ చేస్తామన్నారు. జిల్లాలోనే కీలకమైన రూరల్ మండలంలో సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని, ఆ మేరకు రెవెన్యూ గ్రామాల వారీగా సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకుంటామని, కాలువలు, చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల పరిధిలోని రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయనను పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉద్యోగులు అభినందించారు.